రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
కడప	6.31	4.58
ప్రొద్దుటూరు	6.32	5.02

ఎన్టీఆర్ ఇళ్లకు భరోసా



- 21,350 ఎన్టీఆర్ గృహాలకు.. జగన్ హయాంలో గ్రహణం
- పెండింగ్ గృహాల పూర్తికి రూ.203 కోట్లతో ప్రతిపాదనలు

కడప కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు గూడు కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు సర్కారు నడుం బిగించింది. 2014-19 టీడీపీ పాలనలో జిల్లాలో పెద్ద ఎత్తున పేదలకు గృహాలు మంజూరయ్యాయి. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో జిల్లాలో 21,350 పేదల గృహాలను అటకెక్కించారు. జగన్ అధికారంలోకి రావడంతోనే ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులకు మొండిచేయి చూపారు. ఇప్పుడు ఆ ఇళ్ల నిర్మాణానికి చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు ఇటీవల ఆదేశాలు రావడంతో హౌసింగ్ శాఖలో కదలికలు మొదలయ్యాయి. అప్పట్లో బిల్డింగ్ నిర్మాణానికి రూ.2.50 లక్షలుగా ప్రకటించారు. అందులో కొన్ని ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటి పూర్తితో పాటు ఇక్కడ మౌలిక వసతులకోసం దాదాపు రూ.203 కోట్ల వరకు నిధులు అవసరమని అంచనాలు వేశారు. ఈమేరకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రభుత్వానికి సమగ్ర నివేదికలు పంపారు.

రూ.4 లక్షల వరకు అందే అవకాశాలు?

ఎన్నికల హామీల్లో భాగంగా కొత్తగా ఇళ్లు నిర్మించే పేదలకు ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం 2.0 కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల వరకు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో ఇచ్చిన ఎన్టీఆర్ ఇళ్లు మంజూరై నిర్మాణాలు చేపట్టకపోతే కొత్త పథకం వర్తింపజేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇందులో కేంద్రం నుంచి రూ.1.50 లక్షల సాయంతో పాటు రాష్ట్ర వాటా కింద కూటమి సర్కారు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనుంది. ఇప్పుడున్న పరిస్థితిల్లో ఇళ్లు కట్టడం పేదలకు ఆర్థిక భారం కావడంతో మిగతా రూ.1.50 లక్షలను బ్యాంకు రుణం కింద అందించే అవకాశాలున్నాయి. ఈ పథకం వర్తిస్తే త్వరలో వారిఖాతాల్లో బిల్లులు విడతల వారీగా జమైతే.. పేదల ఇంటికల నెరవేరడం ఖాయంగా కనిపిస్తోంది.

కాంట్రాక్టర్లపై కన్నెర్ర

జగన్ హయాంలో జిల్లాలో ఆర్భాటంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో దాదాపు 65 వేల ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఆ ఇళ్లకు గ్రహణం తప్పదని వైసీపీ వారు దుష్ప్రచారం సాగించారు. కానీ పేదలకు గూడు కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా జగన్ హయాంలో మొదలు పెట్టి ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎస్సీలకు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున అదనపు నిధులు ఇచ్చారు. కాగా.. జగన్ పాలనలో మంజూరైన ఇళ్లను రూ.1.80 లక్షలతో నిర్మిస్తామని కాంట్రాక్ట్ పొందిన వారు బేస్ మట్టం నుంచి అడ్డగోలుగా బిల్లులు చేసుకున్నారు. జగన్ మళ్లీ వస్తాడంటూ, అధికారం మాదేనంటూ బిల్లులు దండుకొని ఇళ్లు పూర్తి చేయలేదు. పేదల ఇళ్ల విషయంలో అగ్రిమెంట్లు పొంది ఇంకా నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర చేసింది. రాష్ట్రంలో ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని, అధిక మొత్తం బిల్లులు దండుకున్న 25 మంది కాంట్రాక్టర్లను రాష్ట్ర హౌసింగ్ ఎండీ రాజబాబు తొలగించారు. మన జిల్లాలో 20 వేల ఇళ్ల కాంట్రాక్టులు దక్కించుకున్న వారందరిని వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకపోతే మూల్యం తప్పదని హెచ్చరించారు. దీంతో ఆ కాంట్రాక్టర్లు ఆగమేఘాల మీద వైసీపీ హయాంలో ఒప్పుకున్న ఇళ్లను పూర్తిచేసే పనిలో పడ్డారు.

నివేదికలు పంపాము

2014-19 మధ్య తెలుగుదేశం పాలనలో పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్లలో 21,350 ఇళ్లు అసంపూర్తిగా మిగిలాయి. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించని కారణంగా ఈ నిర్మాణాలు అర్ధంతరంగా ఆగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ ఇళ్ల నిర్మాణ డేటాను సేకరించాం. దాదాపు రూ.203 కోట్ల అంచనాలతో నివేదికలను కలెక్టర్ పంపించారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

- రాజశేఖర్, హౌసింగ్ పీడీ

సమస్యలు పరిష్కరించాకే పరిశ్రమ ఏర్పాటు

- దుగ్గనపల్లె గ్రామాన్ని మరోచోటికి తరలిస్తాం : కలెక్టర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

మైలవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమలోని దుమ్ము, ధూళి, బ్లాస్టింగ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సమస్యలు పరిష్కరించాకే రెండో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నవాబుపేట సమీపంలో దాల్మియా పరిశ్రమ రెండవ ప్లాంట్‌కు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దుగ్గన పల్లె గ్రామస్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. సమస్యలు పరిష్కరించకుండా రెండవ ప్లాంట్‌కు సిద్ధమైతే ఇటుక కూడా పడనీయమని, అడ్డుపడుతామనితెలిపారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెలలో దుగ్గనపల్లె గ్రామానికి చెందిన రైతు మోష మిరప పంటలో దుమ్ము, ధూళి పడి పంట దిగుబడి రాక నష్టపోయి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ముందుగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుగ్గనపల్లె గ్రామాన్ని మరోచోటికి తరలించి అక్కడ 18 నెలల్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. సాగుకు పనికిరాని భూములను రైతుల అభీష్టం మేరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా దాల్మియా వారు కొనుగోలు చేస్తారన్నారు. అలాగే వంకను వెడల్పు, లోతు పెంచుతామని మునుముందు నీరు నిలబడకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. దాల్మియా పరిశ్రమ రెండవ ప్లాంట్ రావడంతో సమీప గ్రామాల్లోని ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వమని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహశీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పొల్యూషన్ అధికారులు, దాల్మియా అధికారులు, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉపసర్పంచ్ ఎన్నికలు

కడప రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 9 స్థానాలకు గాను 8 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం ఉప సర్పంచ్ ఎన్నిక మినహా సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మ గూడూరు ఉపసర్పంచ్ స్థానికి చల్లా శివస్వప్న, సీకేదిన్నె మండలం బుసిరెడ్డిపల్లెకు దొండపాటి వెంకటరమణారెడ్డి, కమలాపురం మండలం కోగటం స్థానానికి కనపర్తి రవణమ్మ, బి.మఠం మండలలోని గొడ్లవీడుకు బద్వేల్ రామలక్షుమ్మ, యర్రగుంట్ల మండలం తుమ్మలపల్లికి గోర్ల తులశమ్మ, దువ్వూరు మండలం ఇడమడకకు ముద్దన లక్ష్మీదేవి, చెన్నూరు మండలంలోని ముడియపల్లికి షేక్ అబ్దుల్లా ఉపసర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

వేంపల్లెలో సంచలనం

- మొత్తం ఇన్విజిలేటర్లు, చీఫ్‌లు, డిపార్ట్‌మెంటు ఆఫీసర్ల తొలగింపు

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణలో గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు సంచలనం నిర్ణయం తీసుకున్నారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఎ, బి సెంటర్లలో ఉన్న మొత్తం ఇన్విజిలేటర్లు, చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను తొలగిస్తూ డీఈవో షంషుద్దీన్ నిర్ణయం తీసుకున్నారు. ఆయా సెంటర్లలో పనిచేస్తున్న 24 మంది ఇన్విజిలేటర్లను, నలుగురు చీఫ్‌లను, నలుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను తొలగించారు. సైన్స్ పరీక్ష రోజున జిల్లా పరీక్ష పరిశీలకుడు మధుసూదనరావు తనిఖీ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు పూర్తయ్యాక గదులు పరిశీలించి అక్కడ కాపీ చీటీలు ఉన్నట్లు గుర్తించి ఈ సమాచారాన్ని జిల్లా అధికారులకు తెలిపారు. దీంతో ఎప్పుడూ లేని విధంగా మూకుమ్మడిగా ఇన్విజిలేటర్లను తొలగించారని అంటున్నారు. సైన్స్ రెండో పేపరు పరీక్షకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ఇన్విజిలేటర్లను, చీఫ్‌లను, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లను తొలగించి కొత్త ఇన్విజిలేటర్లు, చీఫ్‌లు, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లను నియమించారు. ఇప్పటికే జాబితా వచ్చిందని వేంపల్లె ఎంఈవో జాఫర్ సాధిక్ తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలోని రెండు సెంటర్లలో కొత్త సిబ్బందితో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

వైసీపీ రెబల్‌కు ఉపాధ్యక్ష పదవి


ఖాజీపేట వైస్ ఎంపీపీగా ఎన్నికైన స్వప్న

ఖాజీపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట వైస్ ఎంపీపీ స్థానాన్ని వైసీపీ రెబెల్ అభ్యర్థి దక్కించుకున్నారు. గతంలో వైస్ ఎంపీపీగా ఉన్న దుగ్గిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఆ పదవికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. మండల పరిధిలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా అందులో ఇద్దరు టీడీపీ వారు కాగా 12 మంది వైసీపీ వారు. ఇందులో ఒకరు రాజీనామా చేయగా మరొకరు ఎన్నికలకు హాజరుకాలేదు. 10 మందితో గురువారం ఎన్నికలు నిర్వహించారు. వైసీపీ తరుపున మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బలపరిచిన వెంకటసుబ్బారెడ్డికి ముగ్గురు మాత్రమే చేతులు ఎత్తారు. వైసీపీలోని రెబల్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి మద్దతుదారులు అయిన భూమాయపల్లె ఎంపీటీసీ ముమ్మడి స్వప్నకు అయిదుగురు చేతులు ఎత్తారు. దీంతో ముమ్మడి స్వప్న ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించడంతోపాటు డిక్లరేషన్ ఫారం అందించి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు.

క్రిష్ణారెడ్డి ప్రైవేటు కేసులో.. చార్జిషీటును వెనక్కు పంపిన కోర్టు?

పులివెందుల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ క్రిష్ణారెడ్డి ప్రైవేటు కంప్లయింట్ కేసుకు సంబంధించి పులివెందుల పోలీసులు వేసిన ఫైనల్ చార్జిషీట్‌ను కోర్టు వెనక్కు పంపిందని తెలిసింది. ఇప్పటికే పోలీసులు ఈ కేసుకు సంబంధించి రెండుసార్లు చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నెల 13న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ స్వయంగా జమ్మలమడుగు కోర్టుకు వెళ్లి ఫైనల్ ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన కోర్టు అభ్యంతరాలు ఉండడంతో తిరస్కరించిందంటూ గురువారం మీడియా సర్కిళ్లలో ప్రచారం సాగింది. ఈ విషయంపై డీఎస్పీ మురళీనాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తాము వేసిన చార్జిషీట్ కోర్టు తిరస్కరించలేదని అన్నారు. ఫైనల్ చార్జిషీట్ వందశాతం తిరస్కరణకు గురి కాలేదని అన్నారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి


కల్యాణవేదికను పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

ఒంటిమిట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకయ్యచౌదరి మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏప్రిల్ 5న అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. 6న శ్రీరామనవమి జరగనుండగా 11వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరఫున సీతారాముల వారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణవేదిక వద్ద భక్తుల ప్రవేశ నిష్క్రమణ మార్గాల్లోను, ఆలయ పరిసర ప్రాంతాల్లో మరింతగా ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణలు భక్తులు వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్‌లను, అన్న ప్రసాదాల పంపిణీ, భక్తులకు స్వామివారి తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు వీలుగా పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకుముందు అదనపు ఈవోకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి వచ్చే మార్గాలను, ఆలయ పరిసరాలు, కల్యాణవేదిక, క్యూలైన్లు భక్తులకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవోలు శ్రీరామ్ కుమార్, సదా లక్ష్మీ, అన్నప్రసాద విభాగం, ప్రత్యేక అధికారి, జీవీఎల్ఎన్ శాస్త్రి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరుకు రూ.5 కోట్లు విడుదల

ప్రొద్దుటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల నుంచి బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020లకు సంబంధించి వసూలైన ఫీజుల నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి రూ.3 కోట్లు, కమలాపురం నగరపంచాయతీకి రూ.2 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఆమేరకు మెమో నెంబరు 2761982/ ఎం2/ 2025 జారీ చేశారు. ఈ నిధులతో మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రొద్దుటూరు కమిషనర్ మల్లికార్జున తెలిపారు.

జడ్పీ చైర్మన్‌గా రామగోవిందరెడ్డి



జడ్పీ చైర్మన్‌గా ముత్యాల రామగోవిందరెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జడ్పీ చైర్మన్ ఎన్నికకు హాజరైనట్టుగా సంతకం చేస్తున్న 98 సంవత్సరాల గాలివీడు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ బానుబీ

- ఏకగ్రీవంగా ఎన్నిక

కడప రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా బి.మఠం జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జడ్పీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికకు కూటమి జడ్పీటీసీ సభ్యులు హాజరుకాలేదు. దీంతో జడ్పీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. ప్రస్తుతం ఉన్న 48 మంది జడ్పీటీసీలలో 41 మంది హాజరయ్యారు. వీరిలో 98 సంవత్సరాల వయసున్న గాలివీడు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ బానుబీ ఉన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన రామగోవిందరెడ్డితో జిల్లా ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించి డిక్లరేషన్ పత్రాన్ని అందించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం రామగోవిందరెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అవినీతికి తావు లేకుండా పరిపాలన సాగిస్తానన్నారు. కార్యకర్తలకు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, రమేశ్ యాదవ్, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, డాక్టర్ దాసరి సుధ, జడ్పీ సీఈవో ఓబులమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, వైసీపీ జడ్పీటీసీ సభ్యులు, పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు. కాగా.. వైసీపీ జడ్పీటీసీలు ఒక్కొక్కరికి చైర్మన్ అభ్యర్థి రూ.15 లక్షలు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ మొత్తంలో క్యాంపు కోసం ఖర్చు పెట్టిన రూ.1.50లక్ష మినహాయించి, మిగిలిన రూ.13.5 లక్షలు వారి చేతికి ఇచ్చారని సమాచారం.

హాజరుకాని ఏడుగురు జడ్పీటీసీలు

జడ్పీ చైర్మన్ ఎన్నికకు 48 మంది జడ్పీటీసీ సభ్యులలో ఏడుగురు హాజరుకాలేదు. వీరిలో వేంపల్లె వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డికి మాతృవియోగం కావడంతో ఆయన రాలేదు. మిగిలిన వారిలో వైసీపీ నుంచి కూటమిలోకి వచ్చిన ముద్దనూరు జడ్పీటీసీ బడుగు ఉమాదేవి, జమ్మలమడుగు జడ్పీటీసీ దండ్లూరు అశ్విని, చిన్నమండెం జడ్పీటీసీ మోడెం జయమ్మ, ఓబులవారిపల్లె జడ్పీటీసీ పందికాళ్ల లక్ష్మినరసయ్య, వీఎన్ పల్లె జడ్పీటీసీ నిమ్మకాయల రాజేశ్వరమ్మతో సహా టీడీపీకి చెందిన గోపవరం జడ్పీటీసీ కలువాయి జయరామిరెడ్డి ఎన్నికకు హాజరుకాలేదు.

చేనేత మహిళలకు జీవనోపాధి

- జిల్లాలో ఏడు క్లస్టర్లు
- ప్రత్యేకంగా మహిళా గ్రూపులు
- 500 మందికి పైగా ప్రయోజనాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని చేనేత మహిళలకు మెరుగైన జీవనోపాధులు కల్పించేందుకు చేనేత, జౌళిశాఖ అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్స్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం)లో భాగంగా చేనేత మహిళలకు చేయూతనివ్వనుంది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండి మగ్గాలు ఉన్నవారికి మరింత ఆధునికమైన ఫ్రేమ్ మగ్గం, మోటార్ లిఫ్టింగ్ జాకార్డ్ లాంటివి అందివ్వనున్నారు. అదేవిధంగా సొంతంగా పట్టా భూమి ఉన్న మహిళా సభ్యులకు ఒక సెంటు స్థలంలో వర్క్‌షెడ్ నిర్మాణానికి రూ.1.20 లక్షలు మంజూరు చేయనున్నారు. ఇందులో 90 శాతం రాయితీ ఉండగా పది శాతం లబ్ధిదారు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. మొదటగా 70 నుంచి 80 మంది వరకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా బేస్‌లైన్ సర్వే పూర్తి చేశారు. ఒక్కొక్క క్లస్టర్ కింద 150 నుంచి 200 చేనేత కుటుంబాలు ప్రయోజనం పొందనున్నాయి. మగ్గాలు, జాకార్డు, మగ్గానికి సంబంధించిన పరికరాలు అందివ్వనున్నారు.

జిల్లాలో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 20 వరకు క్లస్టర్లు ఏర్పాటు చేసి మాస్టర్ ట్రైనర్స్ ద్వారా మగ్గంలో మెలకువలపై శిక్షణ ఇచ్చిన సందర్భాలున్నాయి. అయితే కొంత కాలానికి వాటి నిర్వహణను వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి క్లస్టర్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో వేలాది చేనేత కుటుంబాలు నేటికి మగ్గం నేతపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న పరిస్థితి ఉంది. వారికి ఏదొక విధంగా మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేనేత, జౌళిశాఖకు సంబంధించిన క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు స్వయంగా మాట్లాడి క్లస్టర్ల ఏర్పాటుకు దస్త్రం సిద్ధం చేసి ప్రభుత్వానికి అధికార యంత్రాంగం పంపింది.


మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. చేనేతపై ఆధారపడి జీవిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నప్పటికీ వారు మగ్గాలపై తయారు చేసిన వస్త్రాలకు తగినంత మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో చేనేత కార్మికులకు గిట్టుబాటు కావడం లేదు. గతంలో లివ్వరతో చీరలు కూడా నేసేవారు. చేనేత సహకార సొసైటీల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆప్కో ద్వారా నేరుగా కొనుగోలు చేసేది. జిల్లాలో చేనేత సంఘాలు ఒక వెలుగు వెలిగాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లిబరీ కొనుగోళ్లను తొక్కేసింది. చేనేత సంఘాల వద్ద కూడా భారీస్థాయిలో నిల్వలు ఉండిపోయాయి. జిల్లా కేంద్రంలో ఉన్న ఆప్కోలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు ఉండేవారు. వారు సొసైటీల వద్దకు వెళ్లి వస్త్రాన్ని పరిశీలించి సేకరించారు. అయితే నేరుగా రాష్ట్రస్థాయి నుంచి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడంతో జిల్లాలో పలుచోట్ల నిల్వలు ఉండిపోయాయి. ఈ క్రమంలో చేనేత కార్మికులకు కూడా పని దొరకడం కష్టతరమైంది.

వీటిని అధిగమించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో మాధవరం, జమ్మలమడుగు, మైలవరం, ప్రొద్దుటూరు, దత్తాపురం, రంగాపురం, బి.కోడూరు, రామసముద్రంలో ఏడు క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌డీసీ కింద మరో నాలుగు క్లస్టర్లు

నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ప్రొద్దుటూరు పట్టణంలో మరో నాలుగు క్లస్టర్లు ఏర్పాటు కోసం చేనేత జౌళిశాఖ సన్నాహాలు చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచనలతో చేనేత కుటుంబాలకు మరింత ప్రయోజనం కలిగించేలా సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని చౌడేశ్వరినగర్, ఈశ్వర్‌రెడ్డినగర్, దొరసానిపల్లె, ఖాదరాబాద్‌లలో క్లస్టర్లు


మగ్గం నేస్తున్న మహిళ

ఎన్ఆర్ఎల్ఎంల ద్వారా జీవనోపాధి

స్వయం సహాయక సంఘాల్లోని మగ్గం ఉన్న మహిళలకు నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ద్వారా మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రొద్దుటూరులో ఎన్‌హెచ్‌డీసీ కింద నాలుగు క్లస్టర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

- అహ్మద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి

గోపవరంలో హైటెన్షన్



గోపవరం పంచాయతీ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, డీఎస్పీ భావన

- ఉత్కంఠగా మారిన ఉపసర్పంచ్ ఎన్నిక
- ఇరు పార్టీల బలప్రదర్శన
- వైసీపీ వార్డు మెంబర్లు హాజరు కాకుండా అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- రాళ్లదాడి - పోలీసుల స్వల్ప లాఠీఛార్జి
- కోరం లేక ఎన్నిక వాయిదా



ఎన్నిక కేంద్ర సమీపంలో మోహరించిన పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. వైసీపీ వార్డు మెంబర్లను ఎన్నిక కేంద్రానికి వెళ్లనివ్వకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ వార్డు మెంబర్ల వాహనాలపై రాళ్ల దాడి చేయడంతో వాహన డ్రైవరు, వార్డు మెంబర్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. వివరాలిలా..

గోపవరం పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు మెంబర్లలో 14 మంది వైసీపీకి ఉండగా ఆరుగురు టీడీపీ వైపు ఉన్నారు. ఉపసర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు టీడీపీ పావులు కదిపింది. గోపవరం ఉపసర్పంచ్ పదవిలో రెండున్నర సంవత్సరం ఓసీ అభ్యర్థిని మరో రెండున్నర సంవత్సరం బీసీ అభ్యర్థిని ఉపసర్పంచ్‌గా నిలబెడుతానని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట ఇచ్చారు. ఒప్పందం మేరకు కాల పరిమితి పూర్తి అయిన అనంతరం ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి రాజీనామాచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడం, కొంతమంది వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలోకి చేరడంతో గత ఎమ్మెల్యే బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. దీంతో రాజీనామా చేసిన ఉపసర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డిని మళ్లీ బరిలోకి దింపడం.. వైసీపీ వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయాలు నడిచాయి. ఈ నేపథ్యంలో ఆరుగురు టీడీపీలోకి చేరారు. ఉప సర్పంచ్ పదవిని తమ ఖాతాలోకి వేసుకునేందుకు ఆ పార్టీ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఎన్నిక సందర్భంగా గురువారం ఉదయం ఎన్నిక కేంద్రం వద్దకు వచ్చిన బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌పై టీడీపీ శ్రేణులుదాడికి పాల్పడారు. వీరి నుంచి తప్పించుకుని ఇరువురు ఎన్నిక కేంద్రమైన గోపవరం పంచాయతీ కార్యాలయంలోకి చేరుకున్నారు. అప్పటికే టీడీపీకి చెందిన ఆరుగురు వార్డు సభ్యులు ఎన్నిక కేంద్రంలో ఉన్నారు. మిగిలిన 12 మంది వైసీపీ వార్డు మెంబర్లు వాహనాల్లో ఎన్నిక కేంద్రానికి వెళ్లడానికి ప్రయత్నించగా టీడీపీ శ్రేణులు అడ్డుకుని దాడికి యత్నించారు. దీంతో వారు వెనుతిరిగారు. ఇలా రెండు మూడు సార్లు ఎన్నిక కేంద్రానికి వైసీపీ వార్డు మెంబర్లు హాజరయ్యేందుకు ప్రయత్నించగా వారి వాహనాలపై రాళ్లదాడి జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపు చేశారు.

నకిలీలతో కోరం చూపించే యత్నం

గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికల్లో మొత్తం 20 మంది వార్డు మెంబర్లు ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన ఆరుగురు ఎన్నిక కేంద్రానికి హాజరయ్యారు. వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, పవన్‌కుమార్‌లు టీడీపీ శ్రేణుల నుంచి తప్పించుకుని లోనికి ప్రవేశించారు. అప్పటికి మొత్తం ఎనిమిది మంది వార్డు సభ్యులు లోపల ఉన్నారు. మిగిలిన వార్డు మెంబర్లను ఎన్నికకు హాజరుకాకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో బయట ఉద్రిక్తత నెలకొంది. ఎన్నిక కొనసాగాలంటే 11 మందితో కోరం ఉండాలి. దీంతో 10వ వార్డు మెంబరు కందుల బీబీ, 9వ వార్డు అభ్యర్థి షేక్ ఖాదర్‌బాష, 4వ వార్డు మెంబరు కేశవస్థానంలో వారి పేర్లతో ముగ్గురు నకిలీలు ఎన్నిక కేంద్రానికి చేరుకున్నారు. వీరిని గోపవరం మూడవ గ్రామ సచివాలయ కార్యదర్శి ఈశ్వరి పరిశీలించి నకిలీలుగా గుర్తించారు. అయినప్పటికి అధికార బలంతో ఎన్నిక కేంద్రంలోకి ఆముగ్గురు చొరబడ్డారు. లోన ఉన్న వైసీపీ అభ్యర్థులు రాఘవేంద్రారెడ్డి వారు నిజమైన అభ్యర్థులు కారని, నకిలీలు అని వాదించారు. దీంతో అధికారులు వారిని బయటికి పంపించారు. ఎన్నిక సమయం గడువు ముగియడం, సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేదని ఎన్నిక నిర్వహణ అధికారి, మండల ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి ఎన్నికను వాయిదా వేసి పంచాయతీ కార్యదర్శితో కలిసి పోలీసు బందోబస్తుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఎన్నిక వాయిదా పడకుండా కొంతమంది టీడీపీ నాయకులు ఎన్నిక కేంద్రం వద్దకు చేరుకుని విశ్వప్రయత్నాలు చేశారు. మరోవైపు కొర్రపాడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, మండల వైస్‌చైర్మన్ బంగారురెడ్డి, వైసీపీ నాయకులు తమ వర్గీయులతో మోహరించారు. వారి వద్ద ఉన్న 12 మంది అసలైన వార్డు మెంబర్ల వీడియోలను తీసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించి ఇక్కడ జరిగే ఎన్నిక వాయిదా వేయడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నిక కేంద్రంవద్ద నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు ఎన్నిక కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీఎస్పీ భావన, సీఐలు శివరాముడు, రామక్రిష్ణ, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు ధనుంజయుడు, శ్రీనివాసులు, మహమ్మద్‌రఫి, మరో 50 మంది పోలీసులు ఎన్నిక బందోబస్తులో పాల్గొని ఎప్పటికప్పుడు పరిస్థితిని సద్దుమనిగేలా చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఉపసర్పంచు ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఎన్నికల నిర్వహణ అధికారి ప్రకటించారు. తదనంతరం టీడీపీ వార్డు మెంబర్లు అక్కడి నుంచి వెళ్లిపోగా వైసీపీ వార్డు మెంబర్లు రాఘవేంద్రారెడ్డి, పవన్ కుమార్‌లను పోలీసు బందోబస్తుతో వారి ఇళ్లవద్దకు చేర్చారు.

'గండి'లో హుండీ లెక్కింపు.. రూ.7లక్షలు ఆదాయం



గండి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చక్రాయపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం కమిషనరు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 45 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకులను లెక్కించగా రూ.7,07,750 ఆదాయం వచ్చింది. అలాగే నిత్యాన్నదాన పథకానికి రూ.14,407 ఆదాయం వచ్చింది. కాగా, కూరగాయల టెండర్లకు వేలం నిర్వహించగా ఎక్కువ మంది పోటీ పడటంతో ప్రస్తుతానికి రద్దు చేశారు. కార్యక్రమంలో గండి దేవస్థాన చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, మెంబరు వెంకట్రామిరెడ్డి, ఆలయ సిబ్బంది, త్రిబుల్‌ఐటీ విద్యార్థులు, బ్యాంకు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టరు కుమారస్వామి గుప్త, తదితరులు

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ సీఎస్‌సీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. హైదరాబాదుకు చెందిన పోసిడెక్స్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో 9మంది విద్యార్థులు రూ.6లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు డైరెక్టరు కుమారస్వామి గుప్త, ఏవో పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ప్లేస్‌మెంటు కోఆర్డినేటరు వినోద్, ప్లేస్‌మెంటు ఆఫీసరు సుందర్‌లను అభినందించారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

జమ్మలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్, డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. అర్బన్‌స్టేషన్‌లో ఆవరణాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాని సూచించారు. అనంతరం సైబర్‌నేరాలకు సంబంధించి పోలీసు అధికారులతో చర్చించారు. మట్కా, క్రికెట్, బెట్టింగ్, గ్యాంబ్లిక్ తదితర నేరాలు జరుగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రామక్రిష్ణ, సుబ్బారావు, లక్ష్మినారాయణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మైదుకూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో నంద్యాల రోడ్డులోని మహబూబ్‌నగర్‌లో నివశిస్తున్న గోర్ల పాపయ్యగారి సుబ్బలక్షుమ్మ (49) అనే మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. సుబ్బలక్షుమ్మ గత శుక్రవారం రాత్రి తన కుమార్తెతో కలిసి ఇంటిపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి కాలకృత్యాల కోసం కిందకు వస్తుండగా ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి పడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు ఆమె బంధువులు తెలిపారు. సుబ్బలక్షుమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు కాగా, ఒక కుమార్తెకు వివాహమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



సంఘటనా స్థలంలో డోలా సతీష్ మృతదేహం

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీ గంగరాజుపురం ప్రధాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రాఘవరాజుపురం పంచాయతీ హరిజనవాడకు చెందిన దివ్యాంగుడు డోలా సతీష్ (38)గా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

లారీ బోల్తా - ఒకరి మృతి

బోల్తాపడిన లారీ



ఖాజీపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో లారీ బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్‌మాబూసాహెబ్(47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మైదుకూరు నుంచి కడపవైపు వెళుతున్న లారీ పత్తూరు సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తాపడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడు మాబూసాబ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్

కడప రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ద్వారా సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నామన్నారు. పకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలోని వ్యవసాయ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, ప్రీ-మాన్సూన్ డ్రైసోయింగ్, స్వయం సహాయక సంఘాల ద్వారా రైతుల సాధికారత వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. హార్టికల్చర్ అధికారి సిందూరి ఆ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు పీడీఎం వసంతకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూముల పరిశీలన



జడ్‌హెచ్‌డీసీ భూములపై విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

రాజంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ పరిధిలోని జడ్‌హెచ్‌డీసీ భూములను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 1984లో సుమారు 50 మంది ఎస్సీలకు ఇచ్చిన భూములను పరిశీలించారు. ఎస్సీల కోసం కోళ్లఫారాల పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ భూములను ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ భూములను సక్రమంగా వినియోగించుకోలేదని, ఇతరులు ఆక్రమించారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆలయాన్ని కూడా నిర్మిస్తున్నారని ఈ అంశాలపై తాము విచారణ చేస్తున్నామన్నారు. ఎస్సీలకు కేటాయించిన ఈ భూముల్లో ఎటువంటి ఆక్రమణలు జరిగినా తహశీల్దారుతో సర్వే చేయించి కలెక్టర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశ-2 ఎంపికలకు ఈ నెల 28 చివరి తేదీ అని తెలిపారు. ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్‌లో ప్రదర్శించినట్లు వివరించారు. 26వ తేదీ లోపు ఆప్షన్ సర్వీస్ ద్వారా కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలు సూచించాలని తెలిపారు. దశ వన్ వెబ్ ఆప్షన్‌కు ఎడిట్ ఆప్షన్ లేదని తెలిపారు.

ఇరువురు గంజాయి విక్రేతల అరెస్టు

కడప క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బైపాస్‌లోని సంజన్న సర్కిల్ వద్ద గంజాయి అమ్ముతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. కడపకు చెందిన దూదేకుల సిద్దు, తాటి నాగసురేశ్ కుమార్‌లు ద్విచక్ర వాహ నంలో సంజన్న సర్కిల్ వద్దకు వచ్చి గంజాయి విక్రయిస్తు న్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేసి వారిని అరెస్టు చేసి 1250 గ్రాములు గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి గిద్దలూరుకు చెందిన దాసరిగాని పరారయ్యాడని.. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన ఇరువురిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

30 నుంచి పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు



పెద్దపీరయ్యస్వామి జీవ సమాధి ఫొటో

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడు సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఈనెల 30, 31 తేదీలలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి కలుగోట్ల సిద్దయ్య తెలిపారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆరాధనోత్సవాల సందర్భంగా 30న ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవ అన్నసత్రంలో అన్నదాన కార్యక్రమం, రాత్రి 10గంటలకు గోపాల్ బృందం వారిచే రేలారే రేలా కార్యక్రమం, సీసీ ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అలాగే బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం, పట్టాభిస్వామి కోలాటం ఉంటుంది. 31న చిన్న, పెద్ద వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా క్రికెట్‌లో రాణిస్తున్న శ్రీచరణి

- బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో ప్రతిభ
- తొలిరోజే మల్టీడేస్ మ్యాచ్‌లో 6 వికెట్ల కైవసం



కడపస్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మహిళా క్రీడాకారిణి ఎన్.శ్రీచరణి బీసీసీఐ సీనియర్ మహిళా చాలెంజర్స్ ట్రోఫీలో రాణించారు. డెహ్రాడూన్ రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ స్టేడియంలో నిర్వహించిన బీసీసీఐ సీనియర్ ఉమెన్స్ చాలెంజర్స్ ట్రోఫీలో యర్ర గుంట్ల మండలం యర్రంపల్లెకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి ఏకంగా 6 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బతీశారు. అక్కడి మల్టీడేస్ మ్యాచ్‌లో టీం-ఏ, టీం-బీ జట్లు తలపడగా టీం-బీ జట్టుకు శ్రీచరణి ప్రాతినిధ్యం వహిస్తూ వేసిన 32 ఓవర్లలో 8 మెయిడిన్ ఓవర్లతో పాటుగా 6 వికెట్లు సాధించారు. కాగా జిల్లాకు చెందిన శ్రీచరణి జాతీయ స్థాయిలో సత్తా చాటుతుండడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



భరత్ మృతదేహం, భరత్ (ఫైల్)

తంబళ్లపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం తంబళ్లపల్లె మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల కేంద్రం తూర్పు హరిజనవాడకు చెందిన జి.వెంకట్రమణ కుమారుడు భరత్(27) బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి బయటకు వెళ్లా డు. తంబళ్లపల్లెకు సమీపంలోని రేణుమాను బావి గట్టు మీద కూర్చుని స్నేహితులతో కలసి మద్యం సేవించారు. అర్ధరాత్రైనా భరత్ ఇంటికి రాకపోవడం, ఫోన్ తీయకపోవడంతో కంగారు పడిన తల్లితండ్రులు.. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి రేణుమాను బావి వద్ద వెతకడంతో గట్టు మీద మృతుడి చెప్పులు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. దీంతో భరత్ బావిలో పడిపోయాడనే అనుమానంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, సిబ్బంది బావి వద్దకు చేరుకుని స్థానికులు, మృతుడి కుటుంబసభ్యుల సహాయంతో పాతాలభైరవి, నీటి కెమెరాలతో బావిలో తీవ్రంగా గాలించారు. బావి పెద్దదిగా ఉండటం, అందులోని నీళ్లు ఎక్కువగా పాచి పట్టి ఉండటంతో ఎంత శ్రమించినా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమయంలో మృతుడు భరత్ బావిలో శవమై పైకి తేలాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సహాయంతో వెలికితీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, భరత్ ఓ ప్రవేటు బస్సులో కండక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతిచెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కొడుకు మృతిపై అనుమానాలున్నాయని పోలీసులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని భరత్ తల్లితండ్రులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.

బాలికలకు పోషకాహారం అందించాలి

● మహిళా సంరక్షణ కార్యదర్శి సునంద

చెన్నూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపాలున్న బాలికలను గుర్తించి వారికి సరైన పోషకాహారం అందించినప్పుడు వారు శారీరకంగా, మానసికంగా బలంగా ఉంటారని చెన్నూరు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సునంద అన్నారు. గురువారం స్థానిక సరస్వతీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికల వికాసంపై అంగన్వాడీలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, ఇతర నేరాల గురించి వివరించడంతో పాటు తల్లిదండ్రులు కూడా వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శక్తి యాప్‌ను ప్రతి మహిళ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

● వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం వైద్యాధికారి వినయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీబీ నిర్ధారణ అయిన వారికి, వారి కుటుంబ సభ్యులకు సీవై-టీబీ టెస్ట్ డోస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ 42 గంటల తర్వాత పాజిటివ్ వస్తే టీబీ చికిత్స ప్రారంభిస్తామని, నెగిటివ్ వచ్చిన వారికి 3హెచ్‌పీ మూడు నెలలు చికిత్స అందిస్తామన్నారు. ఈ టెస్ట్ చేయడం వల్ల వ్యాధిని వీలైనంత త్వరగా నిర్ధారణ చేసి టీబీని నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్రనాథ్, సీహెచ్‌వోలు అలీ, ఫరూక్, తౌఫిక్, ఉదయశ్రీ, ఏఎన్‌యం స్వరూప, ఆశావర్కర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

● ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్. మాధవి



ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉమేష్ చంద్ర కళ్యాణమండపంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. మనిషి సత్ప్రవర్తనతో మెలగడానికి రంజాన్ ఉపవాసాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన, ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, వీయస్ అమీర్‌బాబు, టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగ కువైట్ ఉపాధ్యక్షుడు రహమతుల్లా, మాసాపేట శివ, జిలానీబాష, మన్సూర్ అలీఖాన్, మాసా కోదండరామ్, మన్నూరు అక్బర్, కార్పొరేటర్లు జఫ్రుల్లా, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం : ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ పుణ్యకార్యమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం కె.అప్పాయపల్లె సమీపంలోని మసీదు-ఏ-మహ్మదీయ మసీదులో మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకురాలు మోదిన్‌బీ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, రహీం, బాబుల్ చిన్నసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే

కడప మారుతీనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కార్పెంటర్స్ డే సందర్భంగా ఉచిత గుండె పరీక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వైద్యశిబిరంలో వైద్యులు సుధీర్ కుమార్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నందకుమార్ రెడ్డి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు నాగరాజు, హరిప్రసాద్, జిల్లా ప్రధా నకార్యదర్శి మధు, పవన్, వీరాచారి, నర సింహులు పాలొన్నారు.

'యువత మేలుకో' పోస్టర్ విడుదల

సీకేదిన్నె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఓ యువత మేలుకో.. వ్యసనాలు మానుకో.. అనే పోస్టర్‌ను ఎమ్మెల్యే మాధవిరెడ్డి విడుదల చేశారు. గురువారం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో టీఎన్‌ఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విషసంప్రదాయమన్నారు. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథరెడ్డి, నాయకులు లోకేష్, అనిల్, విశ్వనాథ్, సుబ్బరాయుడు, ప్రతాప్, ఇర్ఫాన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై జారిపడి వ్యక్తి మృతి

కడప(క్రైం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక విజయదుర్గాదేవి ఆలయం సమీపంలో స్కూటర్‌పై వెళుతూ రోడ్డుపై జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ జావెద్ వివరాల మేరకు.. విజయదుర్గాదేవి ఆలయం సమీపంలో రోడ్డుపై ఆయిల్ పడిపోయింది. చెమ్ముమీయపేటలోని విజయనగర్ కాలనీకి చెందిన బలపనూరు వెంకటేష్ (65) గురువారం రాత్రి స్కూటర్‌పై వెళుతూ రోడ్డుపై ఆయిల్ ఉండటాన్ని గమనించక జారిపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్సా పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

20లీటర్ల నాటుసారా స్వాధీనం

పులివెందులటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. గురువారం పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద నాటుసారా అమ్ముతున్న పెనుకొండ తరుణ్‌కుమార్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

కూతురు కనిపించలేదని ఫిర్యాదు

పులివెందులటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నకొండారెడ్డి కాలనీలో నివాసముంటున్న వెంకటేశ్వరి (18) కనిపించలేదని తల్లి సరోజ పట్టణ పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. అదే కాలనీలో ఉంటున్న శశాంత్ తన కూతురికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

కడప మారుతీనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు, కండక్టర్లు, డ్రైవర్ల కారణంగా ఏవైనా సమస్యలుంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకూ డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలు, సలహాలను 9959225848 నెంబర్‌కు డయల్ లేదా వాట్సాప్ చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పులివెందుల టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఇప్పెట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో గురువారం కోడిదెల ఉసేనమ్మ రెండో వర్థంతి సందర్భంగా ఆమె కుమారుడు రిటైర్డ్ తహసీల్దారు కుళాయప్ప, కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మాబున్నీ, మనవడు రాజా, జాస్మిన్, విహాన్, అల్లుడు బాబా సాహెబ్, కుళాయమ్మ, వెంకట్రామిరెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న రిటైర్డ్ తహసీల్దారు కుళాయప్ప

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

● ఏఐఎస్ఎఫ్.. ఆర్ఎస్ఎఫ్‌ల నిరసన

సీకేదిన్నె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన ప్రైవేటు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు వలరాజు డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయం ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రం లీకులకు పాల్పడినవారిపై గట్టి చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీకేజీ ఘటనలో 9 మంది నిందితులు అరెస్టు చేసినా ఇంకా అసలైన నిందితులు ఉన్నారని, వారిని కూడా ప్రత్యేక కమిటీ వేసి దర్యాప్తు చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. విద్యార్థి తప్పు చేస్తే డీబార్ చేస్తారని, అదేవిధంగా ఈ ఘటనకు పాల్పడిన వారిపై ఐపీసీ 409, పబ్లిక్ ఎగ్జామినేషన్ యాక్టు 1997 ఐసీపీ 420, 120బీ కింద అదుపులోకి తీసుకోవాలన్నారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నగర అధ్యక్షుడు అకిరానంద్, తేజ, చంద్ర, అరుణ్, రాజేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ ప్రధాన సూత్రదారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో ప్రశ్నాపత్రం లీక్ చేసి వేంపల్లికి వాట్సాప్ ద్వారా పంపడం అంటే ముందుగానే ప్రైవేటు స్కూలు యాజమాన్యం సిండికేట్ అయి లక్షల రూపాయలు చేతులు మార్చుకుని పక్కా ప్రణాళికాబద్ధంగా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సిద్దిక్, వినీల్, వెంకట్, సురేంద్రరెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

'దాల్మియా విస్తరణను తక్షణమే నిలిపివేయాలి'

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణను తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండల పరిధిలో ఉన్న చిన్నకొమెర్లలో 2008లో 2.6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో దాల్మియా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైందన్నారు. పరిశ్రమ కోసం చిన్నకొమెర్ల, దుగ్గనపల్లి, నవాబుపేట, తలమంచి పట్నం గ్రామాలకు చెందిన 600 మంది సన్న చిన్నకారు రైతులు 300 ఎకరాలు, మైనింగ్ కోసం 1800 ఎకరాలు మొత్తంగా 2,100 ఎకరాల భూమిని పరిశ్రమ కోసం ఇచ్చారన్నారు. ఆ పరిశ్రమ కారణంగా చుట్టుప్రక్క గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్వారీ పేలుళ్ల కారణంగా విడుదలయ్యే దుమ్ము, ధూళి, రాళ్ల కారణంగా పంటలు నాశనమవుతున్నాయన్నారు. వాగుకు అడ్డుకట్ట వేయడంతో ఫ్యాక్టరీ ఎగువ దళిత గ్రామాల ప్రజలు వారాల పాటు వరద నీటిలో ఉండాల్సివస్తోందన్నారు. రెండో ప్లాంట్ నిర్మాణం పేరుతో మరిన్ని గ్రామాల ప్రజల మనుగడకు ముప్పు తెచ్చే దాల్మియా సిమెంట్ యాజమాన్యం దుర్గార్గాలను నిలువరించాలన్నారు.

విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్ అందించడం హర్షణీయం

కడప కల్చరల్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని 21 మంది విద్యార్థినులకు రూ.6లక్షల స్కాలర్‌షిప్స్‌ను అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే ఆర్.మాధవి కొనియాడారు. గురువారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న మలబార్ గోల్డ్ షాపింగ్ మాల్‌లో బాలికలకు స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మలబార్ గోల్డ్ ముందుందు మరిన్ని మంచి సేవాకార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్‌జెడీ రవికుమార్, డీఈవో షంషుద్దీన్, మలబార్ గోల్డ్ డైమండ్స్ కడప షోరూమ్ హెడ్ లెసన్ సత్యన్, యాజమాన్యం పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ చేపట్టాలి

కడప కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి): పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాస్టర్ మృతిపై అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● అనవసర మెసేజ్‌లకు స్పందించకండి ● కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడప క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం సైబర్ నేరాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వన్‌టౌన్ పోలీసుస్టేషన్ నుండి సెవెన్‌రోడ్స్, ఎన్టీఆర్ సర్కిల్, పాత బస్టాండు, రెండో గాంధీ బొమ్మ, టీకేయం స్ట్రీట్, గోకుల్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం వైట్ కాలర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అనవసర మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. అపరిచితులు పంపిన మెసేజ్‌లను నొక్కితే మన ఖాతాలోని డబ్బులు కాజేస్తారన్నారు. కొత్తకొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడతారని, ఆండ్రాయిడ్ మొబైల్ వాడే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారినపడితే తక్షణమే సం బంధిత పోలీసుస్టేషన్‌తో పాటు సైబర్‌సెల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానం.. పారిశుధ్యం

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని శ్రీంనగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కాల్వలు నిండిపోయి రోడ్లపై ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచిపోయింది. రోడ్డు మధ్యలోనే మురుగునీరు చేరి, అందులోనే చెత్తచెదారం వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. వాటర్‌ట్యాంకుకు వెళ్లే రహదారిలో రోడ్డుపైనే మురికినీరు చేరి ప్రజలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు, చెత్తచెదారం తొలగించాలని కోరుతున్నారు.



శ్రీరాంనగర్ వద్ద రోడ్డుపైనే నిలిచిన మురుగునీరు

వైఎస్ సుశీలమ్మ నేత్రదానం



సుశీలమ్మ (ఫైల్‌ఫొటో)

పులివెందుల టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చవ్వా సుభాకర్‌రెడ్డి కాలనీలో ఉన్న వైఎస్ సుశీలమ్మ (84) మరణించడంతో ఆమె నేత్రదానానికి భర్త వైఎస్ ఆనందరెడ్డి, కుమారుడు వైఎస్ రాజేశ్‌రెడ్డి, కుమార్తెలు అంగీకరించారు. దీంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థకు, స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకి సమాచారం ఇవ్వడంతో వారు మృతురాలి నివాసం వద్ద కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. మరణానంతరం నేత్రాలు దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు కోరారు.

రాహుల్‌ను మాట్లాడనివ్వకపోవడం దారుణం

● వేంపల్లెలో కాంగ్రెస్ నేతల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న తులసిరెడ్డి, తదితరులు

వేంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై పార్లమెంటులో రాహుల్‌గాంధీ మాట్లాడబోతుంటే అడ్డుకోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి మండిపడ్డారు. గురువారం వేంపల్లెలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగం, అధిక ధరలు, అప్పులు, రైతాంగ సమస్యలు, కుంభమేళా మృతులు, భారతీయులకు అమెరికా అధికారుల బేడీలు తదితర సమస్యలపై రాహుల్‌గాంధీని మాట్లాడనివ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పులివెందుల ఇన్‌చార్జ్ ధృవకుమార్‌రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, మండల అధ్యక్షులు రామక్రిష్ణ, ఉత్తన్న, వేమా, రాజా తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిజానిజాలు నిగ్గుతేల్చాలి

● కొవ్వొత్తులతో నిరసన



సంతాప కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధీర్

కడప కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతికి సంబంధించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని టీఎస్‌బీఐ డైరెక్టర్ కేకే సుధీర్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రవీణ్ మృతికి సంతాపంగా గురువారం కృపా కాలనీకి చెందిన పాస్టర్ పి.మహేష్ అధ్యక్షతన వినాయకనగర్ సమీప చర్చిలో ప్రత్యేక సంతాప కార్యక్రమం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా సుధీర్‌తో పాటు కో-ఆర్డినేటర్ సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. భారీ సంఖ్యలో హాజరైన దైవజనులు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ జిల్లాలో జన్మించి హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక సేవలందించి రాజమండ్రిలో అనుమానాస్పదంగా చనిపోవడం బాధాకరమన్నారు. ఆయన మృతిని విశ్వాసులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు స్పందించి పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సేవకులు రవితేజ, కిరణ్, రాజేష్, దేవకుమార్, దానియేలు, అబ్రహాం, తదితులుపాల్గొన్నారు.

నేడు అర్జున్ హాస్పిటల్‌కు కాలేయ వైద్యనిపుణుడి రాక



డాక్టర్ వంశీధర్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై అపోలో హాస్పిటల్‌కు చెందిన కాలేయ వైద్య నిపుణుడు డాక్టర్ వంశీధర్‌రెడ్డి ఈనెల 28వ తేదీ నగరంలోని నెహ్రూపార్క్ సీపీసీ ఆఫీస్ సమీపంలో ఉన్న అర్జున్ హాస్పిటల్‌కు రానున్నారు. ఆయన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2-30గంటల వరకూ అందుబాటులో ఉంటారని అర్జున్ హాస్పిటల్ సిబ్బంది తెలిపారు. ప్రతినెలా నాల్గవ శుక్రవారం ఆయన కడప అర్జున్ హాస్పిటల్‌లో వైద్యసేవలందిస్తారని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9985422583, 8332080900 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రేషన్ ఈకేవైసీ గడువును పొడిగించాలి

కడప సెవెన్‌రోడ్స్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సర్వర్ పనిచేయక రేషన్ ఈకేవైసీతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గడువును మూడు నెలలకు పెంచాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సంబంధిత పరిపాలనాధికారి శంకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈకేవైసీ పేరుతో రేషన్ కార్డుల కోత తగదన్నారు. ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించాలని ప్రభుత్వం ప్రకటన చేయడం వలన లబ్ధిదారులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ఉపాధి కోసం, చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటశివ, కేసీ బాదుల్లా, సావంత్ సుధాకర్, మునయ్య, భాగ్యలక్ష్మి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పేకాటరాయుళ్ల అరెస్టు

ముద్దనూరు మార్చి27(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఆరు మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. వారి నుంచి రూ.4742 స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

పోరుమామిళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా పోరుమామిళ్ల మండలంలో రూ.2 కోట్ల 63లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడమే కాకుండా ఆ పనులను పూర్తి చేసింది. మరలా రూ.2 కోట్ల 90 లక్షలకు ప్రతిపాదనలు కూడా పంపింది. దీంతో కొన్ని వీధుల్లో, గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం జరగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోరుమామిళ్ల మండలంలో మార్కాపురం, క్రిష్ణంపల్లెతో పాటు మరికొన్ని వీధుల్లో సిమెంటురోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలతో ఉన్న దమ్మనపల్లె వెళ్లే రహదారి నిర్మాణానికి గత వైసీపీ హయాంలో రూ.74 లక్షలు నిధులు మంజూరైనా కూడా నిధులు లేని కారణంగా ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలు సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లాలంటే నరకయాతన పడాల్సివచ్చింది ప్రస్తుతం రూ. 95లక్షలతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.అలాగే బుచ్చంపల్లె ప్రాంతంలో రూ.35 లక్షల తో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. పోరుమామిళ్ల, రంగసముద్రం మరికొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అవి జిల్లా కలెక్టర్ వద్ద ఆమోదం పొందాల్సి ఉంది. ఆమోదం లభిస్తే మరికొన్ని చోట్ల రోడ్ల నిర్మాణం జరిగే అవకాశాలున్నాయి.


సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజల ప్రాణాలతో ఆటలాడుకోవద్దు

జమ్మలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో దాల్మియా సిమెంటు అధికారులు, యాజమాన్యం చెలగాటం ఆడుకోవడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అన్నారు. గురువారం దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ వలన సమీప గ్రామాలు అయిన దుగ్గనపల్లి, చిన్నకొమెర్ల, నవాబుపేట గ్రామాలకు సంబంధించిన వివిధ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒక లేఖను పంపించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దాల్మియా సిమెంటు పరిశ్రమ విస్తరణ పేరుతో పరిసర గ్రామాల పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను నిలుపుదల చేసి విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

ఉచిత పాలిసెట్ కోచింగ్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. గురువారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉందని, ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి జేవీవీ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పోరుమామిళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు మద్యం తాగి వాహనాన్ని నడిపారని వారిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశామన్నారు. వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజరుతో చెక్ చేసి వారు మద్యం తాగినట్లు నిరూపణ తరువాత కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన ఇఫ్తార్‌లో పాల్గొన్న ముక్తియార్



ప్రొద్దుటూరు , మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ పాల్గొన్నారు. గురువారం విజయవాడలో దావత్ ఏ ఇఫ్తార్ విందులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన స్వహస్తాలతో ఖర్జూర పండును ముక్తియార్‌కు తినిపించి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సమాజానికి అండగా నిలుస్తానని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు.

పేదరికం తగ్గించడమే లక్ష్యం

ముద్దనూరు మార్చి27(ఆంధ్రజ్యోతి):గ్రామీణ పేదల సామాజిక సమీకరణ, జీవనోపాధిని మెరుగు పరచడం ద్వారా పేదరిక తగ్గింపే ప్రభుత్వ లక్ష్యమని సెర్ప్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వెలుగు సంఘాల సభ్యులకు వార్షిక, ఆర్థిక జీవనోపాదుల పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.శిక్షణా కార్యక్రమాన్ని సెర్ప్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పర్యవేక్షించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ వెలుగు సంఘాలలోని పెదలను గుర్తించాలన్నారు.వారి ఆర్థిక ఎదుగుదలకు అవసరాలను తెలుసుకొని వ్యక్తిగత బ్యాంక్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. డీపీఎం లు నీలకంఠారెడ్డి, లావణ్య, ఇన్‌చార్జి ఏపీఎం ఇబ్రహీం, వెలుగు సీసీలున్నారు.

'అసిస్టెంట్ రిజిస్ట్రార్ పై పున: విచారణ జరపాలి'

ప్రొద్దుటూరు , మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంవీ ప్రభాకర్ రావు అవినీతిపై పున: విచారణ జరపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విన్నవించారు. గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై ఆరుగురు వ్యక్తులు చేసిన ఫిర్యాదుమేరకు జిల్లా సహకారశాఖ అధికారి చేత విచారణకు ఆదేశించినారన్నారు. అయితే సదరు విచారణ అధికారి పై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. విచారణ అధికారి ఫిర్యాదు దారులకు విచారణకు రమ్మని ఆదేశించిన నోటీసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నఎంవి ప్రభాకర్ రావు ముందే విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొనడం ఉద్దేశ్యం వెల్లడయిందన్నారు. .గతంలో కూడా ప్రభాకర్‌రావు మీద ఫిర్యాదులు చేస్తే విచారణ అధికారి సురేష్‌బాబు అతనితో కుమ్మక్కై బాధితులకు అన్యాయం చేశారన్నారు. కనుక ఆవిచారణను రద్దు పరిచి తిరి గి కొత్త_అధికారితో పున: విచారణ జరిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీదేవగుడి నారాయణరెడ్డి ఉన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

పోరుమామిళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మండలంలోని దమ్మనపల్లెలో సీతారామయ్య గృహంలో గురువారం రాత్రి ఎలక్ట్రికల్ సామాన్లు, హోంనీడ్స్ దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అప్రమత్తమై ఎక్కువ నష్టం జరగకుండా చూశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో రూ.70వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఈఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీఏ చెల్లింపుల్లో జాప్యం తగదు

కాశినాయన మార్చి27(ఆంధ్రజ్యోతి):సీపీఎస్ ఉద్యోగుల డీఏ అరియర్స్ చెల్లింపుల్లో జాప్యం తగదని ఎస్టీయూ సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు కొన్ని బకాయిలు చెల్లించడం సంతోషదాయకమని కానీ గత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు 2018-19లో డీఏ అరియర్స్ బిల్ ట్రెజరీలో పాస్ అయినా పేమెంట్ చెల్లించకపోవడం చాలాబాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏలు అరియర్స్ త్వరగా అందేలా చూడాలని కోరారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రొద్దుటూరు , మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :దొరసాని పల్లె గ్రామంలో ఓ ఐస్‌బండి కార్నర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చి ఫీజులు ఎగిరి పోయాయి. ఐస్‌బండి వ్యాపారి తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ,లైన్‌మెన్ శ్రీనివాసులు, జూనియర్ లైన్‌మెన్ ప్రకాశ్‌రెడ్డిలు వెళ్లి విద్యుత్ లైనుకు సరఫరా నిలిపివేసి ఐస్‌బండిని అక్కడి నుంచి తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉపాధిలో కందకాల పనులు

దువ్వూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె గుట్ట ప్రాంతంలో భూగర్భజలాలు పెంపు నిమిత్తం కండిత కంధకాల పనులు చేయిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. వర్షాలు పడే సమయంలో భూగర్భజలాలు పెంపొందించేందుకు వీలుగా ఈ పనులను కూలీలతో చేయిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ 71 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ప్రణాళికపై శిక్షణ

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళల 2025-26 ఆర్థిక ఏడాదికిగాను బడ్జెట్ ప్రణాళికను తయారు చేయాలని ఎస్‌వీఆర్‌పీ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న వెలుగు కార్యాలయంలో వార్షిక ఆర్థిక, జీవనోపాదుల ప్రణాళికపై వీఓఏలకు, యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఏపీఎం లావణ్య, వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీసీలు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బద్వేలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పన్నులు చెల్లించి పురపాలక సంఘం అబివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం పలువురు బకాయిదారులకు ఆయన సిబ్బందితో కలిసి వెళ్లి నోటీసులు అందించారు. మార్చి 31వ తేది నాటికి అన్ని రకాల పన్నులు చెల్లించి ఆస్తి పన్నులో వడ్డీలో 50 శాతం రాయితీని పొందవచ్చన్నారు. ఇప్పటికే 23 స్పెషల్ టీములు పన్నుల వసూళ్ల కొరకు నిరంతరం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆన్‌లైన్ చెల్లింపులైన ఫోన్‌పే ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చన్నారు. ఈ పన్ను వసూళ్ల కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బి.మఠంలో ప్రశాంతంగా ఉపసర్పంచ్ ఎన్నిక


ఉప సర్పంచ్‌కు నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి సురేశ్

బ్రహ్మంగారిమఠం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని గొడ్లవీడు పంచాయతీలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ, ఎన్నికల అధికారి సురేశ్ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. ఈ ఉప సర్పంచ్ ఎన్నికల్లో వార్డుమెంబర్లు అందరూ కలిసి బద్వేలు రామలక్షుమ్మ అనే ఆమెను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సురేశ్ తెలిపారు. అనంతరం ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రామలక్షుమ్మకు ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బసిరెడ్డి చెన్నక్రిష్ణరెడ్డి, సభ్యులు సిద్దు సిద్దారెడ్డి, గోడె కరుణాకర్‌రెడ్డి, పేరమ్మ, సిద్దు సావిత్రి, బద్వేలు రామిరెడ్డి, మునీశ్వరి, బసిరెడ్డి భాస్కరరెడ్డి, కిన్నెర గురమ్మతో పాటు 8 మంది వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో ఇద్దరు ఉపసర్పంచులు ఏకగ్రీవం

ఎర్రగుంట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలో గురువారం జరిగిన రెండు ఉప సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుమ్మలపల్లె గ్రామ ఉపసర్పంచి ఎన్నికలు ఎంపీడీవో వెంకటరమణయ్య అధ్యక్షత జరిగాయి. 7వ వార్డు సభ్యులరాలు గోర్ల తులశమ్మను ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిర్రాజుపల్లెలో ఈవోఆర్డీ రంతుల్లయ్య ఆధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో 4వ వార్డు సభ్యురాలు యదలపల్లె సుబ్బమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 10మంది వార్డు సభ్యులకు గాను 9మంది హాజరయ్యారు. సర్పంచి బాలగాని సుమలత పాల్గొన్నారు. ఎంపికైన ఉపసర్పంచులకు ఎంపీడీవో వెంకటరమణయ్య, ఈవోఆర్డీ రంతుల్లయ్యలు నియామక పత్రాన్ని అందజేశారు. ఎంపికైన వారికి ఇతర వార్డు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాదు నుంచి బద్వేలుకు ప్రత్యేక బస్సు

బద్వేలు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదిన సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసం బద్వేలు ఆర్టీసీ డిపో వారు హైదరాబాదులోని మియాపూర్ నుంచి బద్వేలుకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ సర్వీసు ఈ నెల 29 శనివారం రాత్రి మియాపూర్ నుంచి 9గంటలకు బయల్దేరనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రోజువారి సర్వీసు కూడా 6.15గంటలకు యథావిధిగా నడుపుతామన్నారు. హైదరాబాదులోని మియాపూర్ నుంచి బద్వేలుకు వచ్చేవారు 8886090136 ఫోన్ పే ద్వారా కూడా రిజర్వేషన్ చేయించుకోవచ్చని వారికి వాట్సప్ ద్వారా టికెట్ పంపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని బద్వేలు పోరుమామిళ్ల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జమ్మలమడుగును సుందరంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వెల్లడి


దుకాణాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది, పీఠాధిపతి ఖాద్రి, భూపేష్

జమ్మలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్‌కు సంబంధించి కొత్తగా నిర్మించిన దుకాణాలను, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జమ్మలమడుగులో అభివృద్ధి కార్యక్రమాలు నూతనంగా నిర్మాణాలు చేసి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. దాదాపు రూ.18 లక్షలు వ్యయంతో పాత బస్టాండు కూడలిలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ దుకాణాల సముదాయాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి ప్రత్యేక పాతెహాలు నిర్వహించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గౌస్ అహమ్మద్, షేక్ షామీర్‌బాష, ఉస్మాన్, ఎత్తపు గోపాల్‌రెడ్డి, దలాల్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ ప్రారంభం

జమ్మలమడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ డివిజన్ సభాభవనంలో గురువారం ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సైదున్నీసా, కమిషనర్ వెంకటరామిరెడ్డి, కూటమి నాయకులు పొన్నతోట శ్రీను, ఐఎల్ చిన్న, రాజారెడ్డి, తోళ్లమడుగు ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బద్వేలుటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యకారణంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెస్తమల్ల సుబ్బారావు కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే విజయమ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కనుమర్లపూటి ప్రసాద్, బెస్తమల్ల వెంకటేశ్వర్లు, సునీల్‌కుమార్, శివయ్యస్వామి, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త రాజారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

కలసపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త రాజారెడ్డి మృతి చెందడం బాధాకరమని ఆయన మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. గురువారం కలసపాడు మండలం, లింగారెడ్డిపల్లె గ్రామంలోని రాజారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త రాజారెడ్డి సేవలనుమరువలేమని, పార్టీలో ఆయనలేటితీర్చలేమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాధన కారి రంతు, వెంకట రామిరెడ్డి, ఎగువసగిలేరు నీటి సంఘం అధ్యక్షుడు చిన్న రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బద్రయ్య, బాలవెంకటరెడ్డి, మస్తాన్, శ్రావణ్ నివాళులు అర్పించారు.

సుధీర్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం


మృతుడు తుంగా సుధీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీటీడీ కళ్యాణమండపం సమీపంలో కారు ఢీ కొనడంతో మృతి చెందిన తుంగా సుధీర్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని టీడీపీ నియోజక వర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెం కటయ్యనగర్‌లోని మృతుడు తుంగా సుధీర్ ఇంటి వద్దకు రితేష్‌కుమార్‌రెడ్డి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, సింగసాని బుజ్జి, చిన్నతూము చైర్మన్ కొర్రపాటి సురేంద్ర, బలిజసంఘం అధ్యక్షుడు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, కొంకుల రమణ, తదితరులు పాల్గొన్నారు.